ఎంతటి హిందూ పతివ్రత పేర వెలసినా, ఊరికి వెలిగా అరుంధతియువాడ—తగిన సతిని పొందాలని వెదుకుతూ అరుంధతిని పరీక్షించటానికి వచ్చిన వశిష్ఠుని జుట్టులా, గడంలా జీబుగా అడ్డదిడ్డంగా పెరిగిన చీకిచెట్లు—చీకిచెట్ల మధ్య "మాదిగిండ్లు."—

స్వచ్ఛమైన పాలపొడి ఆరబోసినట్లున్న వెన్నెల్లో, ఆ పెద్ద చీకిచెట్టు నీడ పడుతోంటే ఆ కొటం-దాని రాతిగోడలు పదిలంగానే ఉన్నాయి-దగ్గర రాళ్ళగనులున్నాయి కాబట్టి. అడవుల దగ్గర్లోలేవు కాబట్టి కొటంమీద బోద నిండుగానూలేదు. మెండుగానూలేదు. కాయకష్టంతో బిరుసెక్కిన నల్లని శరీరంమీద కుళ్ళమాసిన ఎర్ర చిరుగుల చీరలా ఉంది బోద.

ఆ కొటం గంగిది. రాళ్ళదొడ్డిలో పాలీషు రాళ్ళు రుద్దుతుందే ఆ గంగిది. కొటంలో గుడ్డిదీపంముందు గంగి కంటిదీపం వెంకడు. ప్రభుత్వం ప్రచురించిన మూడవ తరగతి తెలుగు వాచకంలో తలదూర్చి, "పుష్టి కరమైన ఆహారము" అనే పాఠాన్ని వల్లిస్తున్నాడు. వాడికి తొమ్మిదేళ్ళుంటాయి. గనిలోంచి గట్టున విసిరేసిన నాసిరకం నల్లరంచురాతి ముక్కలా ఉంటాడు.

సగం ముద్ద చదివి సంగటినీ, వేలు గుండంత ఊరుమిండినీ, రకరకాలఅవతారాలున్న దేవునిలాంటి సత్తుపళ్ళెంలో పెట్టి, "పొద్దుపోయింది సదివింది సాల్లే బువ్వ తిని పడుకో" అంది గంగి. పళ్ళెంలోని బువ్వను కళ్ళెత్తి వెంకడు చూశాడు. పాఠంలోని "శక్తిని ఇచ్చునవి", "పుష్టిని యిచ్చునవి", "రక్షణ ఇచ్చునవి", "ధాన్యములు, దుంపకూరలు, అరటి పండ్లు, చక్కెర, బెల్లము, నెయ్యి, నూనె "పాలు, గ్రుడ్లు, పప్పులు, మాంసము" "పండ్లు, ఆకు కూరలు: ఉప్పు" పళ్ళెంలో కనిపించలేదు. ఈ మాయ ఎవరిదో వాడికి అర్థం కాలేదు. వాడు వాళ్ళమ్మను అడిగాడు.

"అమ్మా ఈ పాటంలో సూడు "శక్తిని, పుష్టిని రక్షణను యిచ్చు వస్తువులను కలిపి తినవలెను" అని రాసినారు. పుష్టికరమైన ఆహారం మనకెందుకులేదు?"

వెంకడి ప్రశ్న అర్థంకాక గంగి తెల్ల

# సిలువ వేసిన మనుషులు



## ప్రమాదీచ 1973 ఉగాది కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

పోయింది. తేరుకొని కొడుకు తెలివితేటలకు మురిసిపోయింది. కొడుకు పక్కన చదికిల బడి నోరు తిరక్క అవస్థపడుతూ అడిగింది:

"పుష్టికరమైన ఆహారమంటే అదేందిరా?"

"పుట్టికరమైన ఆకారం కాదు. పుష్టికరమైన ఆహారము" గర్వంగా వాళ్ళటీచరు హనుమంతు పోజులో వెంకడన్నాడు.

గంగి. కొడుకు పలికినట్లు పలకాలనుకొని పెదాలు కదిపి చూసింది కానీ సాధ్యం కాలేదు. గంగికి చేతుల కష్టం తెలుసుకానీ. కేవల పెదాల కష్టం తెలియదు. సిగ్గుపడుతూ అడిగింది :

"అదంటే ఏందిరా?"

"అంటే.... అందే.... సెప్తా ఉండు, ఈ బొమ్మ సూడు."

"కూరగాయల బొమ్మ."

"రైటు" వెంకడు సాలోచనగా పేజీ తిప్పి, ఉత్సాహంతో చదివాడు.




"అయితే ఈ బొమ్మలో ఉన్న ఇద్దరు పిల్లలనుసూడు. ఒకడు ఇందాక చూచిన ఎలుకవలె చిక్కి ఉన్నాడు. మరొకడు ఒక మాదిరిగా ఉన్నాడు. నిజమేకాని మీరు రెండు బొమ్మలను వేరువేరు పిల్లలని అనుకొను చున్నారు. అది నిజము కాదు. రెండును ఒకే పిల్లవానివి, మొదటిది వానికి మంచి పోషణ లేనప్పుడు తీసినది. రెండవది వానికి మూడు నెలలు పుష్టికరమైన ఆహారం పెట్టిన తర్వాత తీసినది? తెలిసిందా?"

"గంగి బొమ్మలోని ఎలుకవలె ఉండే పిల్లవానివైపు చూసింది. కొడుకును చూసింది. ప్రక్కన్నే అల్లంత దూరంలో చింకి ఈతచాపమీద పడుకొని నిద్రలో కూడా అవస్థపడుతున్న రోగిష్టి నాలుగేళ్ళ కూతురును చూసింది. గంగి మనసు వికలమైపోయింది. ఆవిడ కడుపులో ఎవరో రాక్షసంగా దేవినట్లయింది. ఎవరిమీద కోపమో తనకే అర్థంగాక కొడుకును కసిరింది:

"తిండి తిన్రా ముందు సచ్చినోనాబట్టా, నీ పాటాలు ముండమొయ్యా!"

ఎలాంటి పాతాలైనా ముండ మొయ్యవని గంగికి తెలియదు. మనుషులు ముండ మోస్తారని తెలుసు. గంగి ముండమోసి నాలుగేళ్ళు కావచ్చింది. రాళ్ళ గనిలో పని చేసే మొగుడు, గనిలో నాలుగంగుళాల మందం బండలు లారీకి ఎత్తుతున్నప్పుడు బండ జారి మీదపడి చస్తే ముండమోసింది

కొత్తగా పెళ్ళయిన రోజులూ, ఆ రోజుల్లోని చిన్నచిన్న సంబరాలూ, చెట్టంత మొగుడి చావూ గని ఓనర్లు మొగుడి ప్రాణానికి కొసరి కొసరి. గొణిగి గొణిగి తూకంవేసి ఇచ్చిన రెండు వందల రూపాయిలూ. ఎదిగొస్తున్న కొడుకూ. ఎదగలేక చావలేక మొగుణ్ణీ తన్నూ చంపేందుకే పుట్టిన రోగిష్టి దయ్యపు పిల్లా. రోజూ ప్రొద్దున లేచినప్పటినుంచీ ప్రొద్దు పోయేదాకా చేతులరిగినా, నడుము విరిగినా కాటుక మెరిసేటట్లు కూలి డబ్బుల కోసం రుద్దవలసిన పాలీషు రాళ్ళూ. చాలీ చాలని తిండీ. కొడుకు భవిష్యత్తూ ఏవేవో జ్ఞాపకానికి వచ్చి. గంగి రోగిష్టి కూతురు దగ్గర కూచొని దాన్ని వెర్రిగా చూస్తోంది.

అమ్మ ఎందుకు కసిరిందో వెంకడికి అర్థంకాలేదు. అమ్మలకు కోపం ఎక్కువని వాడికి తెలుసు. సత్తుపళ్ళెంలోని సదిసంగటిని గబగబా మింగి. చెల్లెలు ఓబి పక్క ముడుక్కున్నాడు. అలికిడికి ఆ పిల్ల కదిలింది. చెల్లెల్ని ఎగాదిగా చూస్తూనే వాడి చైతన్యం మేలుకొంది.

ఓబి నిజంగా ఎలుకే. పాఠంలోని ఎలుకే కాళ్ళు బోదపుల్లల్లా ఉంటాయి. కడుపు బానలా ఉంటుంది. నోరు మాత్రం పెద్దది. దానికి పుష్టికరమైన ఆహారంలేదు. ఉంటే బాగుండేది. ఎందుకులేదో? ఊళ్ళోని పెదరెడ్ల పిల్లలు బాగుంటారు. నాయనోరి పిల్లలు బాగుంటారు. కోమటోళ్ళ పిలలు అంత ఊరివుంటారు. మాలవాడలోని ఫాదరీ పిల్లలు—దేవిడ్ గాడు—బాగుంటారు. వాళ్ళేంతింటారో! పాఠంలో చెప్పినవన్నీ తింటారేమో! తనకేమో పొద్దున ఇన్ని గంజినీళ్ళు. పైటేల ఇంత సంగటి. రాత్రి సద్దిసంగటో, కొఱ్ఱ కూడో! ఎప్పుడన్నా నీళ్ళమజ్జిగ. పాలూ, గుడ్లూ, మాంసమూ, పండ్లూ, నెయ్యీ నూనే ఏవీ ఉండవు. ఉప్పూ, మెరపకాయా, ఎర్రగడ్డా తిని బావాలి.

వెంకడికి తమ పరిస్థితి మీద కోపం ముంచుకొచ్చింది. దుఃఖం వచ్చింది. ఆ అలసటలోనే వాడా రాత్రి నిద్రపోయాడు. గంగి పస్తుపడుకొని ఆ రాత్రంతా కుళ్ళుకొంది.

మరునటి రోజేదో సెలవుకాబట్టి పిల్లలు కొంతమంది ఊరికే మాదిగిండ్లకు మధ్య ఉండే చింతవనంలో ఆడుకుంటున్నారు. సమితి ప్రెసిడెంటు కొడుకు శంకరరెడ్డి, ముక్కుసెట్టి కొడుకు కొండిసెట్టీ, ఫాదర్ కొడుకు దేవిడ్, కర్రెంకడూ కలసి వేలిగుండ్లాట ఆడుతున్నారు. ఆటలో కొండసెట్టి ఎక్కువసార్లు ఓడినా, లంచం పెట్టడంలో పెద్దచేయి కాబట్టి దోకటం బాధ తప్పించుకున్నాడు— ఆటలో ఎవ్వరోడినా మిగతా మిత్రులకు లంచమివ్వాలి. మామూలుగా ఏ లంచమూ ఇవ్వలేని కర్రెంకడు దాతలకు ఏజంటుగా వ్యవహరిస్తూ, నిత్యం దాతల తరుపున ఆటలో దోకాలి.

ఆ బృందానికి కొండిసెటి బంగారుబాతు. రోజూ తినటానికి అవో ఇవో తెచ్చి ఇస్తాడు, లేదా అంగట్లో కొత్తగా తయారయిన తినుబండారాలు సమాచారం చెప్పి. మిత్రులను ఊరించి. అవి బారర్ పద్ధతిలో ఎలా లభిస్తాయో మార్గాలు చెపుతాడు. ముక్కుసెట్టి అంగట్లోని పదార్థాల కోసం ఎప్పుడయినా రాళ్ళదొడిలో పాలీషు రాయిని దొంగిలించే పనికూడా కర్రెంకడిపై మిత్రులు వేస్తుంటారు. కర్రెంకడు వాళ్ళ దయా బద్ధుడు. ఆ రోజు కొండసెట్టి జీడీల రుచి చూపించాడు. మిత్రుల నోటి తీపు తీరక మరికొంచెం తెమ్మనే

వేళకు కొండిసెట్టి జబ్బురాజు శంకరరెడ్డి ఏమి అనలేక దేవిడ్ మీద తిరగబడ్డాడు.

"నీ కవసరమయితే దొంగగా పాలపొడి తెచ్చి మా అంగట్లో యిచ్చి కొనుక్కుంటావే! మాటి మాటికీ చిక్కేది నీవేనా? పాలపొడి తేపో - మనందరికీ కావలసిన జీడీలు పెట్టిస్తాను"

పాలపొడి మాట వినేవేళకు వెంకడి మనస్సు పూరింది. వాడు ఆతురతగా దేవిడ్ వైపు తిరిగి అడిగాడు.

"ఏం పాలపొడి?"

"అదే వాళ్ళ నాయనకు మూటెలకొద్దీ పాలపొడి వస్తాన్నే- గోదుమలూ, నూనే."

"మా నాయన ఇంట్లో ఉంటాడు" దేవిడ్ గొణిగాడు.

"నేను చూశాన్లే. ఆంబళ్ళపొద్దున బస్సెక్కిపోతే. తేరా నీ యబ్బని గంటేమీ పోదు మాటిమాటికీ కొండిసెటేనా పాపం! పాలపొడి తేపో" శంకరరెడ్డి మందలించాడు.

వాడు సమితి ప్రెసిడెంటు కొడుకు. ఆయన పులి. పులిబిడ్డ పులిబిడ్డే పులులు గొర్రెల్ని కనవు. పిల్ల పులిరాజు ఆజ్ఞ దేవిడ్ పాటించక తప్పదు.

"సరేలే. ఓరే వెంకట్ నువ్వు తోడు రారా".

దేవిడ్ వెంకన్ని తీసుకొని ఏసుపురం వైపు నడిచాడు. ఏసుపురమూ ఊరికి వెలిగానే ఉన్నా, అరుంధతీయవాడకు ఎడమగా ఉంది. దారిలో వెంకడు అడిగాడు:

"ఓరే దావీదూ! ఆ పాలపొడి ఏంచేస్తార్రా?"

"పాలు చేసుకుంటార్రా"

"అవి తాగితే బలం వస్తుందా" పాలపొడి పాలు బాగుంటాయా?"

"బ్రహ్మాండంగా ఉంటాయి."

"నువ్వు రోజూ తాగుతావా?."

"ఓఁ."

దేవిడ్ తన గొప్పకోసం ఆ మాట అన్నాడు కానీ, వాడు పాలపొడిపాలు మాత్రమే తాగవలసిన అవసరంలేదు. వాళ్ళ నాన్న ఫాదర్ జాన్ దొరల నోట్లోంచీ ఊడిపడ్డవాడు. ఇంట్లో దొరలపద్దతే. దొరల బిడ్డలు బయట నిజం చెప్పరు.

"నేనెప్పుడూ పాలపొడి చూల్లేదు. పాలు తాగలేదు" వెంకడు నిట్టూర్చాడు. దేవిడ్ పలకలేదు.

"దావీదూ కొంచెం పాలపోడి నాకియ్యరా" వెంకడు సందేహిస్తూ అడిగాడు.

"ఏందుకు?"

"మా చెల్లెలూ, నేను తాగుతాంరా. మా చెల్లెలు కోసంరా. పాలు తాగితే జబ్బులు పోతాయికదరా. మన తెలుగు పాఠంలో సెప్పినారు కదరా - పాలు పుష్టిని యిస్తాయని కొంచెం స్త్రాలా."

దేవిడ్ వెంకడి ముఖంలోకిచూచి ఊరుకున్నాడు

"నా బొంగరం ఇస్తాలేరా, గోలుగుండ్లు ఇస్తాలేరా. నెమలి ఈకలు ఇస్తాలేరా?"

దేవిడ్ బిగుసుకపోయాడు.

వెంకడి అహం బాగా దెబ్బతింది. డేవిడ్‌ను కిందపడవేసి తందామనుకున్నాడు కానీ వెంకడి రక్తం అంత సులభంగా తిరగబడదు.

"సరేలేరా-నీ జత నాకెందుకు?"

దేవిడ్ మాటవరుసకు వెనక్కి పిలుస్తున్నా వినిపించుకోకుండా వెంకడు ఇంటి వైపు చీకి చెట్లమధ్యగా పరుగెత్తాడు. వాడి మనసునిండా ఆపుకోలేని ఉక్రోషం ఉంది. ఇంటిదగర ఆ సమయంలో అమ్మ ఉండదనే విషయం జ్ఞాపకానికి వచ్చి రాళ్ళ దొడ్డివైపు మళ్ళేడు వేపచెటు కింద, పక్కన్నే గోనెపటమీద పిల్లని పడుకోబెట్టి రాళ్ళు రుద్దుతున్న గంగి కొడుకు పైసా డబ్బుల కోసం వస్తున్నాడనుకొని "సల్లర లేమిరా" అంది.

"అక్కర్లేదులే."

"ఆడుకోను పోలేదా? పో నీ ఈ దయ్యమ్మొండనన్నా ఆడించు. నా దుంప తెంచుతోంది. ఒకటేఏడుపు తిన్నా ఏడుపు తినకపోయినా ఏడుపే, రాకాస నోరు సెరువు కడుపు."

చెల్లెలిని చంకలోకి తీసుకొన్నాక వెంకడి క్షోభ ఇంకా ఎక్కువయింది. వాడు బెరుకు బెరుగ్గా అమ్మను అడిగాడు.

"అమ్మా! పాలపొడి పాలు మంచియేనా?"

"కాదురా. మంచియి కాదు."

నిజానికి గంగికి ఏ పాలపొడి గోలా తెలియదు మంచివి అంటే కొడుకు ఏగొడవ పెడతాడోనని అబద్ధం చెప్పింది.

"మంచియని పాదరివాళ్ళ దావీదు చెప్పినాడే! పాదరి ఇంట్లో పాలపొడి దండిగా ఉంటుందట. అడిగి తీసుకోవె. ఓబికి రోజూ పొయ్యొచ్చు. రోగం పోతుంది పాదరీని అడగవే"

"పాదరీ మనకియ్యరు మనం మతంలో సేరలే. మనకియ్యడు "గంగి నిట్టూర్చింది. మతం పుచ్చుకున్న వాళ్ళకు కూడా పాలపొడి ఎందరికో దక్కదని గంగికి తెలియదు పైగా గంగి చెయ్యాచావదు. ఇంటి దేవుడు తిరుపతి వెంకన్ని వదలదు. కొడుకుపేరు దేవుని పేరేనాయె!

"పాలు తాగితె పుష్టి కలుగుతుందే, మనం మతంలో సేరదామె. పాలపొడి దొరుకుతుందేమో"

"పనీ పాటాలేదు. వసపిట వాగినట్లు వాగుతావు పిల్లనెత్తుకుని ఆడించరా అంటే ఎందో పుష్టిపుట్టి అంటావు వాళ్ళనీ నీళ్ళు సూసి అట్టా బతుకు దామంటావు. అంత పొద్దుపోకుంటే రెండు రాళ్ళరుద్దు. పావలా డబ్బులు వస్తాయి." మాట జారినందుకు గంగి బాధపడిపోయింది. రాళ్ళ కష్టంలో కొడుకుని దించకూడదని గంగి బయటికి చెప్పుకోని శపథం అమ్మ మాటలతో వెంకడికి ఆత్మజ్ఞానం కలిగింది:

"అవునే ఈ సదువొద్దు. రోజూ పాలీషు రాళ్ళు దుద్ది ఓబికి పాలూ పండ్లూ కొందాం."

గంగి మనసు గిలగిలలాడింది. పసిపిల్లాడి కష్టంతో తినటమా! వాడు చదువుకొని చిన్న ఉద్యోగం చేసినా కష్టాలు గట్టెక్కుతాయి ఈ రోజుల్లో తమ కులమోళ్ళకు మంచి ఉద్యోగాలు వస్తాయంటున్నారు. వాడి బ్రతుకు కంచు బండలపాలు కాకూడదు వాళ్ళ నాన్న ఈ కంచు రాళ్ళకే బలి అయ్యాడు. తన బ్రతుకు ఈ కంచు రాళ్ళ మధ్యే తెల్లవారుతోంది. కొడుకు రాళ్ళమనిషి కాకూడదు గంగి ఒక నిశ్చయానికి వచ్చింది. కొడుకును కేకవేసింది:

"నువ్వా నీ ఎదవసోది కటిపెట్టు. నువ్వు సదువుకొని ఉద్యోగం చేస్తే నాకదే సాలు. రాళ్ళు రుద్దా వద్దు బండల కింద పడి సావా వద్దు. నువ్వు, సదువాడిలితే నేను ఉరేసుకొని సస్తా. నోరు మూసుకొని కొంపకెళ్ళు.లేదా ఆడుకో-ఆ పిల్లను ఆడ పడేసి."

అమ్మ అంకమ్మ శివాలు చూసి వెంకడు అదిరిపోయాడు. నిజానికి వాడికి ఆ క్షణంలో అసలు ఏ పనిమీదా ధ్యాసలేదు. వాడికి ఏదో కావాలి. వాడికి తినేతిండి సహించటంలేదు. కటే బట సహించటం లేదు. ఉండే కొంప సహించటంలేదు. పుస్తకంలోని "పుష్టికరమైన ఆహారము" పాఠం వాడి తలకెక్కింది. పాఠంలోని బొమ్మలూ, బొమ్మలోని ఒక బొమ్మలాంటి వాడి చెల్లెలు ఆకారమూ వాడ్ని బాధిస్తున్నాయి. ఆ బాధ తాత్కాలికంగా నివారణ కావాలన్నా వాడికి ఇప్పుడు పాలపొడి కావాలి. డెవిడ్ దాన్ని ఇవ్వలేదు.

చెల్లెలిని మళ్ళీ పటమీద పడేసి గొణుక్కుంటూ చింతవనంవైపు అర్థరహితంగా వెంకడు నడిచాడు. పాలపొడిని కనీసం చూడాలని వాడికి మనసు పడింది. అయితే వనంలో శంకరరెడ్డి, కొండిసెట్టి, దేవిడ్‌లు లేరు వాడికి ఏడుపు వచ్చింది. ఆ సమయంలో అటువచ్చిన సీతారాముడు

తారసపడ్డాడు. సీతారాముడు హనుమంతు టీచరుకొడుకు వెంకడి క్లాసే. సీతారాముడు వెంకడు ఒంటరిగా కన్పించటం చూచి ఆశ్చర్యపడ్డాడు.

"ఏందిరా యిక్కడున్నావు. నీ జత గాళ్ళేరీ?"

"వాళ్ళు మంచోళ్ళుకాదు. ఆ దావీదు గాని జత మానేసినా."

"ఏం?"

కారణం చెప్పటానికి వెంకడికి సిగ్గేసింది.

"చెప్పరా. వాళ్ళతో మనకేం. మనిదరం ఇప్పట్నుంచి ఒక జతగా ఉందాం. ఆ శంకర్రెడ్డిగాడు తోడేలు. సెట్టిగాడు కోతి. దావీదుగాడు నక్కెదవ."

"నిజమేరా. ఆ దావీదుగాన్ని కొంచెం, కొంచమంటే కొంచెం పాలపొడ అడిగినా. నాకోసం కాదరా. మా సెల్లెలు ఓబి ఉందే దానికోసంరా. దానికి పాలు తాపితే జబ్బుపోతుంది. మన పాటంలో రాశినారుకదరా— పుషికరమైన ఆహారం పాటంలో. కానీ ఆ దావిదుగానికి నేనంటే లెక్కలేదు. శంకర్రెడ్డినయితే లెక్కచేస్తాడు— ప్రెసిడెంటు కొడుకని. కొండిసెట్టి అన్నా దావీదుగాని కిష్టమే-వాడికి అంగడి ఉంది. నాకేముంది? నా జతంటే ఎవరికి లెక్క? కొంచెం-కొంచమంటే కొంచెం పాలపొడి ఇవ్వరా అని బతిమాలితే ఇవ్వలేదు. పోనీ డబ్బు సంపాయించి పాలపొడి కొందామంటే మా యమ్మ రాత్రి తిట్టింది, ఇందాకా తిట్టింది"

క్షోభను ఆపుకోలేక వెంకడు వెక్కి వెక్కి ఏడ్చాడు. సీతారాముడు కరిగి పోయాడు.

"ఏడవాకురా ఏడవాకు. బోడి పాలపొడేనా. నేనిస్తాలే. నిన్ననే మా నాయనకు ప్రెసిడెంటు రెండు మూటలు పాలపొడి ఇచ్చినాడంట. మా నాయన స్కూల్లో పెద్ద టీచరు గదా అందుకని. శంకర్రెడ్డి నాయనదంతా మోసమంట. బడిపిల్లోళ్ళకు పంచమని పాలపొడి మూటలు దండిగా ఇస్తే అవి అమ్ముకుంటాడంట; దావీదుగాని నాయనా అంతేనంట. మా నాయన మా యమ్మతో చెప్తాంటే విన్నా. మా ఇంట్లో పాలపొడి ఇప్పిస్తాలే. నా జత ఉండు. మా నాయనతో రాత్రిపూట ప్రయివేటు కూడా చెప్పిస్తా."

"అయితే మీ ఇంట్లోకూడా పాలపొడి ఉందా?" వెంకడి ఆశ చిగిర్చింది.

"ఆఁ"

"మీ నాయన తంతాడేమోరా. ముందుగానే మీ నాయనకు కోపం జాస్తి. బళ్ళో ఎక్కాలు తప్పిపోతే సింతబర్రెతో బాత్తాడు."

వెంకడికి టీచరు యమరూపం మనసులో మెదిలింది. సీతారాముడికి కూడా వాళ్ళ నాన్నంటే చచ్చేంత భయం లేకపోలేదు. కానీ పిల్లల స్వాభిమానం తక్కువేం కాదు. సీతారాముడు నిర్లక్ష్యంగా అన్నాడు.

"పెద్దోళ్ళంతా అంతేరా. నేను పాలపొడి తెస్తాగా. మా నాయన ఇప్పుడు ఇంట్లోలేడు. మా యమ్మ నేనడిగితే తప్పకుండా ఇస్తుంది. కావాలంటే సూడు. మాయమ్మ మంచిదిరా నాతోరా."

ఇద్దరూ సీతారాముడింటికి చేరుకున్నారు. సీతారాముడు వెంకన్ని బయటఉంచి లోపలికి వెళ్ళాడు. వెంకడు బిత్తరచూపులతో చుట్టూ కలియచూస్తున్నాడు. లోపలినుంచి సీతారాముడి తల్లి తిట్లు విన్పించాయి. వెంకడు భయంతో, నిస్పృహతో అక్కన్నుంచి జారుకోవాలను కుంటున్న తరుణంలో టీచరు యముడు హనుమంతు రానేవచ్చాడు. వెంకడినోట తడిలేదు. టీచరు మామూలుగానే అడిగినా వెంకడు వణికిపోయాడు:

"ఏందిరా వెంకా, ఇట్లావచ్చినావు. మా వాని కోసరమా? నువ్వు బాగా—చదువుకో. నీకు బాగానే చదువొస్తుంది. మాదిగిండ్లలో ఇతర పిల్లకాయల మాదిరి తిరిగి చెడిపోవద్దు."

సీతారాముడి తల్లి కొడుకును ఈడ్చుకుంటూ. తిట్టుకుంటూ బయటికి వచ్చింది. మొగున్ని చూస్తూనే గొంతు పెంచింది.

"చూడూ. వీడూ వీడి దరిద్రగొట్టు స్నేహాలూ. వాని మొగానికి పాలపొడి కావాలంట; వీడు పంచుతాడంట; చెల్లెలికి పాలు వాడు తాపాలంట; వీడు పాలపొడి ఇవ్వాలంట; ఇంట్లో కర్ణుడు పుట్టినాడు. సంసారం ముండమొయ్యాల్సిందే."

స్కూల్లో యముడిది జాలిగుండె పరిస్థితి అర్థమయింది. తంటాలుపడి సీతారాముల్ని తల్లి చెరనుంచి విడిపించి వెంకడిలో అన్నాడు:

"ఉండ్రా. పాలపొడి కావాలా? తెప్పిస్తా ఉండు."

హనుమంతు ఇంటోకి వెళ్ళి ఒకపొట్లం తెచ్చి వెంకడి చేతిలో ఉంచి అన్నాడు:

'ఓరే వెంకా. నువ్వు మంచోనివి— నాకు తెలుసు. ఈ పాలపొడి ఇచ్చినట్టు ఎక్కడన్నా కూసేవు మీ అమ్మకి మాత్రం నేనిచ్చానని చెప్పు లేకపోతే దొంగసొమ్మని ఎముకలు విరుస్తుంది. నువ్వు ఇంటికిపదా. మా వాడు తర్వాత ఆడుకోటానికి వస్తాడు.

వెంకడు బెదురుగా తల వూపి. కృతజ్ఞత జాలువారే కళ్ళతో. పాలపొడి పొట్లాన్ని మాసిక చింకి చొక్కా కింద పెట్టుకొని ముందుకు నడిచాడు. కొంత దూరం పోయాక వాడికి సీతా రాముడి ఏడుపు వినిపించింది అయితే సీతారాముడి ఏడుపుకు కారణాలు ఆలోచించే స్థితిలో వెంకడు లేడు. వాడు ఆనంద శిఖరాల మీదున్నాడు. పాలపొడిలో పుష్టికరమైన ఆహారం లభించినట్లూ, ఆరోగ్యం కలిగినట్లూ వాడు తృప్తి పడ్డాడు.

గంగి మొత్తుకున్నా వినకుండా మారాం చేసి పాలపొడి పాలు చెల్లెలు ఓబికి రెండు మూడు గ్లాసులు పట్టించాడు. అది పాలక రాజకీయ కబంధుల్లా చేతులూ నోరూ చాచిందేకాని వద్దనలేదు. వెంకడు సంబరపడిపోయాడు. వాడూ గ్లాసెడు పాలుతాగి తృప్తి పడ్డాడు. కొంతపొడి దాచి, ఆనందంలో గంతులు వేశాడు.

రోజు తిరక్కుండానే, ఓబికీ వెంకనికీ వాంతులూ విరేచనాలూ తెగ కావడంచూసి గంగి గుండె బేజారయింది. తెలిసిన వైద్యాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఆ సాయంత్రానికి ఓబి పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. ఎగశ్వాశతో ఓబి కొట్టుకలాడుతోంది. పిచ్చి పిచ్చిగా వెంకడు కలవరిస్తున్నాడు.

"పుష్టికరమైన ఆహారం.... మంచి పోషణ ఓబి జబ్బుపోతుంది. దావీదుగాడు దొంగ. సీతారాముడు నా జత. హనుమంతు అయ్యవారు దేముడు. పుష్టికరమైన ఆహారము ఓబికి శక్తి....పుష్టి....రక్షణ...."

కొట్టంలో, ఆ రాత్రి గుడ్డిదీపం పక్కన ఓదార్చేవాళ్ళమధ్య తల్లి పేగును వెయ్యి రంపాలతోకోసి యమయాతన పెడుతున్న పిల్లల దీనస్థితిచూసి గంగి నెత్తీనోరూ బాదుకుంది. రక్షించమని గంగి వేడని దేవుడూ లేడు. దేవతాలేదు. కానీ నమ్మిన ఇంటిదైవం తిరుపతి వెంకన్న దిగిరాలేదు. కులదేవత అరుంధతి కదలిరాలేదు. ఏ మహిమా ఎవరూ చూపలేదు. దేవుళ్ళు తమ నిజమైన భక్తులు చెప్పే కథల్లోనే మహిమలు చూపుతారని గంగికి తెలియదు. గంగి గుండెలవిసేటట్లు ఏడుస్తూనే ఉంది.

కొట్టం బయట వెన్నెల. తడిసిన పాలపొడి ముద్దగట్టిన వెన్నెల. కల్తీ పాలపొడిలా మచ్చల నెలరాజు వెన్నెల. ఊరుమీద, ఊరు వెలివేసిన అరుంధతియవాడమీద. వాడలోని గంగి కొట్టంమీద వెన్నెలే. కొట్టంలో మాత్రం సువ్వూ నేనూ సిలువ వేసిన మనుషుల నీడలు

★